నమస్తే తెలంగాణ
ములుగు జయశంకర్ భూపాలపల్లి
5 | ఆదివారం 23 జూన్ 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

# ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి 15 రోజులాయె..

## అయినా పట్టని విద్యుత్ అధికారులు

**రైతులే రిపేరింగ్ సెంటర్‌కు తరలించినా ఫలితం శూన్యం**

**దేవరుప్పలలో ఎండుతున్న నారుమళ్లు**



దేవరుప్పులలో ట్రాన్స్‌ఫార్మర్ గద్దె

దేవరుప్పుల, జూన్ 22: ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి పక్షం రోజులైనా మరమ్మతు చేయకపోవడంతో పంటలకు నీరందని దుస్థితి మండల కేంద్రంలో నెలకొంది. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతు చేస్తే పంపుసెట్లు పనిచేసేవని, విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడంతో వరినార్లు ఎండిపోతున్నాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. దేవరుప్పులలోని గడ్డ చెలుకకు వెళ్లే దారిలో ఎస్ఎస్ 39 నంబర్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి పక్షం రోజులైంది. దీంతో ఐదుగురు రైతులకు చెందిన సుమారు 15 ఎకరాలకు మోటర్ల ద్వారా నీరు పెట్టలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు దున్నిన దుక్కులు ఎండుతున్నాయని, నారుమళ్లు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడంతో వారం రోజుల క్రితమే తామే స్వయంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను సింగరాజుపల్లిలోని రిపేరింగ్ సెంటర్‌కు తరలించినట్లు వారు తెలిపారు. దీనిపై పలుమార్లు విద్యుత్ అధికారులను సంప్రదించగా వస్తదని చెప్పి పంపుతున్నారు తప్ప పరిష్కారం కావడం లేదని పలువురు వివరించారు. కేసీఆర్ పాలనలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిన వెంటనే మరొకటి అమర్చేవారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దీనికి భిన్నంగా ట్రాన్స్‌ఫార్మర్ కాలితే మరొకటి రావడానికి రోజుల తరబడి ఎదురు చూడాల్సి వస్తున్నదని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా ట్రాన్స్‌ఫార్మర్ విషయమై ఏఈ సుధాకర్‌ను వివరణ కోరగా రెండు రోజుల్లో కొత్తది తెచ్చి బిగిస్తామని వివరించారు.

### ఇప్పట్ల రాదని చెప్పిండ్రు..



ఎన్నోసార్లు ఆఫీసుకు పోయి ట్రాన్స్‌ఫార్మర్ కోసం అడిగితే రెండు రోజుల్లో వస్తుందని చెప్పి పంపిస్తుండ్రు. శనివారం మరోసారి పోతే ట్రాన్స్‌ఫార్మర్ రిపేరింగ్ సెంటర్ నంబర్ ఇచ్చారు. అక్కడికి ఫోన్ చేసి విషయం అడిగితే ఇప్పట్ల రాదన్నరు. నారుమడి, దున్నిన దుక్కి ఎండింది. 15 రోజుల నుంచి నీరు లేక వానకాలం నాట్లు ఆలస్యమైతయి. రెండు నెలల కింద ఒకసారి కాలింది. వారం రోజులకు ఇచ్చిండ్రు. నెల కింద మళ్ల కాలింది. 15 రోజుల నుంచి సాగు నీళ్లు లేక తిప్పలు పడుతున్నం.

– సుంకరబోయిన యాదయ్య, రైతు

### బకీట్లల్ల నీళ్లు మోసుకొస్తున్నం..



ట్రాన్స్‌ఫార్మర్ కాలి 15 రోజులైతున్నది. నార్లు ఎండితున్నయ్, దుక్కులు పక్కున పలిగినయ్. వానకాలం నెత్తిమీదికి వచ్చింది. నార్లు పోసినం. నీళ్లు లేక నాట్లు లేటయితున్నయ్. ఇక రెండు ఆవులకు తాగడానికి నీళ్లు లేకుంటె దూరం నుంచి బకీట్లల్ల తెచ్చి తాపుతున్నం. కరెంటాఫీసు చుట్టు తిరిగి తిరిగి యాష్టకొస్తాంది. దబ్బున కొత్తది తెచ్చి ఫిట్ చేస్తే దుక్కులు దున్నుకుంటం. ఎన్నడు లేంది కరెంటోళ్లు ఇంత ఆలస్యం చేస్తుండ్రు.

– వల్లాల ఎల్లయ్య, రైతు



నీటి పంపింగ్ లేక ఎండిన దుక్కులు



## వర్షాలు కురవాలని వరద పాశం

ములుగు రూరల్, జూన్ 22 : వానలు కురవాలని కొత్తూరులోని దేవునిగుట్టపై ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని ప్రతి ఇంటినుంచి సేకరించిన బియ్యం, బెల్లం, కుడుకలతో పాయసం వండి, ఆలయ పరిసరాల్లోని బండలపై పోసి భక్తులు ఆరగించారు. వర్షాలు కురిసి, పంటలు పండి, అందరూ చల్లగా ఉండాలని వరద పాశం కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు వీ కిషన్‌రావు తెలిపారు.

# నీట్ రద్దు చేయాల్సిందే..

*నీట్ పేపర్ లీకేజ్‌పై విద్యార్థి సంఘాలు భగ్గుమన్నాయి. పరీక్షను వెంటనే రద్దు చేయాల్సిందేనని డిమాండ్ చేశాయి. ఈమేరకు శనివారం ఉమ్మడి జిల్లాలో నిరసనలు పెల్లుబికాయి. నర్సంపేటలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించగా, జనగామలో విద్యార్థులకు మద్దతుగా సాదిక్ అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టారు. హనుమకొండలో పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు నినాదాలతో హోరెత్తించారు. పేపర్ లీకేజీకి ప్రధాని మోదీ బాధ్యత వహించాల్సిందేనని డిమాండ్ చేయడంతో పాటు నీట్ అవకతవకలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.*

– జనగామ, జూన్ 22 (నమస్తే తెలంగాణ)/ హనుమకొండ/నర్సంపేట/హనుమకొండ చౌరస్తా




నర్సంపేటలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

- పేపర్ లీకేజీకి ప్రధాని మోదీ బాధ్యత వహించాలి
- నర్సంపేటలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాస్తారోకో
- జనగామలో ఒక్క రోజు నిరాహార దీక్ష
- హనుమకొండలో ప్లకార్డులతో పీడీఎస్‌యూ నిరసన

## భగ్గుమన్న విద్యార్థి సంఘాలు

నీట్‌ను రద్దు చేయాలని బీఆర్ఎస్వీ నియోజకవర్గ నాయకుడు సదిరం వినయ్‌భాస్కర్, పట్టణ అధ్యక్షుడు దేవోజు హేమంత్ ఆధ్వర్యంలో నర్సంపేటలోని అమరవీరుల స్తూపం వద్ద రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ నీట్ అవకతవకలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. గవర్నర్ చొరవ తీసుకుని ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. లేకుంటే టీఆర్ఎస్వీ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతుందని హెచ్చరించారు. నీట్‌తో జనాభా ఎక్కువున్న రాష్ట్రాలకే లాభమని, తక్కువ జనాభా ఉన్న తెలంగాణకు అన్యాయం జరుగుతున్నదన్నారు. తక్షణమే క్యాబినెట్ సమావేశం నిర్వహించి నీట్ నుంచి రాష్ట్రం విత్ డ్రా కావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నల్ల రవీందర్, మురహరి రాకేశ్, విష్ణువర్ధన్, ఎర్ర శ్రీకాంత్, బబ్లూ, అజయ్, బోలెమియా, శంకర్, తరుణ్ పాల్గొన్నారు.

**సాదిక్ అలీ ఆధ్వర్యంలో ఒకరోజు దీక్ష**

నీట్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సాదిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యాయవాది సాదిక్ అలీ విద్యార్థులు, సంఘాలతో కలిసి శనివారం జనగామ ఆర్టీసీ చౌరస్తాలో ఒకరోజు నిరాహార దీక్ష చేశారు. ఇది లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన అంశమని, కేంద్రం వెంటనే చర్యలు తీసుకోకుంటే కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఉద్యమిస్తారని సాదిక్ అలీ హెచ్చరించారు. దీక్షలో హం సాత్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మహ్మద్ యాకూబ్ పాషా, విద్యార్థి సంఘాల నాయకులు అన్వర్, యాకూబ్, ఏఎస్ఎఫ్ఐ నాయకుడు సంపత్, జరసం ప్రతినిధి సాయి, ప్రైవేట్ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధి యాకూబ్ అలీ, ఆవాజ్ కమిటీ ప్రతినిధి అజహరుద్దీన్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి మార్కస్ దీప్తి, మైనార్టీ నాయకులు మసి ఉర్ రహమాన్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

**లీకేజీకి మోదీ ప్రభుత్వం బాధ్యత వహించాలి**

నీట్ పేపర్ లీకేజీ ఘటనకు కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ నరసింహారావు డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండలోని జూనియర్ కాలేజీ వద్ద లీకేజీ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని ప్లకార్డులతో నిరసన చేపట్టారు. నీట్ లీకేజీపై ప్రధాని మోదీ స్పందించాలని, బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని, దోషులను కఠినంగా శిక్షించాలని, వెంటనే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు వై దీపక్ మహేంద్ర, ఏ గోపీచంద్, వీ రాజు, సాయిచరణ్, నాని, గణేశ్, శృతి, అనిత, ప్రణవి, కీర్తిక, కృషిక, అనిత, స్పందన, ప్రియ, ఊర్మిళ పాల్గొన్నారు.




జనగామలో సాదిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలో పాల్గొన్న విద్యార్థి సంఘాలు




హనుమకొండ చౌరస్తా : జూనియర్ కాలేజీ వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

### ఎన్‌టీఏను రద్దు చేయాలి..

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బాలసముద్రంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ తీసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ మాట్లాడుతూ.. నీట్ తరహాలో యూజీసీ నెట్ ఎగ్జామ్‌లోనూ అవకతవకలు జరిగాయని ముందుగానే పరీక్షను రద్దు చేయడం సిగ్గు చేటన్నారు. కేంద్రం నిర్వహించే పరీక్షల్లో అవకతవకలు, కుంభకోణాలు బయటపడడం మోదీ ప్రభుత్వానికే సాధ్యమని ఎద్దేవా చేశారు. మెడికల్ అడ్మిషన్ల ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వాలకే కేటాయించాలని, నీట్‌లో అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్నారు. కార్యక్రమంలో చరణ్, అర్జున్, రామ్, నందిని, కల్యాణ్, రమ్య, ప్రవళిక, అనూష, సందీప్, చరణ్, రాజకుమార్, నితిన్, వైష్ణవి పాల్గొన్నారు.




హనుమకొండ : బాలసముద్రంలో ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

‘తెలంగాణ రాక ముందు కరెంట్ కష్టాల గురించి చెప్పకుంట పోతే ముచ్చట ఒడవది. ఒకటా.. రెండా.. ఎన్నో కష్టాలు పడ్డం. అప్పుడు 2014కి ముందు సక్కగ ఇయ్యక ఎంత ఆగమైనమో ఇంకా మరిచిపోలే. రాత్రిపూట కరెంటుతో రైతులు ఎంతమంది సచ్చిపోయిన్రో లెక్కేలేదు. ఒక్క రైతులే కాదు.. కరెంటును నమ్ముకొని పనిచేసేటోళ్లమంతా అరిగోస పడ్డం. మళ్ల కేసీఆర్ పుణ్యమా అని 24గంటల కరెంట్, పుష్కలంగా నీళ్లిచ్చినంక తొవ్వకచ్చినం. గిట్ల మా రంది తీర్చి కష్టాలు దూరం చేసిన కేసీఆర్‌ను పట్టుకొని ఇప్పడొచ్చిన కాంగ్రెసోళ్లు బద్‌నాం చేయడం మంచిది కాదు.. పాలన సక్కగ చెయ్యక.. పాత కష్టాలన్నీ ముందర పెట్టుకుంట ఆయనను అనుడు పద్ధతి కాదు.. ఆయన ఏం చేసిండో.. ఎట్ల చేసిండో కానీ, రాష్ట్రం మంచిగైందనేది మాత్రం నిజం’ అని సబ్బండ వర్గాల ప్రజలు కుండబద్దలు కొట్టి చెప్పారు.

– నమస్తే నెట్‌వర్క్, జూన్ 22

# కరెంటుపై ఆటలొద్దు..!

**అప్పడు ఆగం చేసింది చాలు**

- 2014కి ముందు ఎట్లున్నదో మరిచిపోలే
- సక్కగ ఇయ్యక ఇప్పుడు నిందలా?.. మండిపడుతున్న సబ్బండ వర్గాలు

### కేసీఆర్ హయాంల కరెంట్ పోవుడన్న ముచ్చటే లేదు



మహదేవపూర్ : నాకు రెండెకరాల భూమి ఉంది. వ్యవసాయమే మాకు జీవనాధారం. నాడు కేసీఆర్ ప్రభుత్వంలోనే రైతులకు నాణ్యమైన కరెంట్ అందింది. గడిచిన పదేండ్లలో ఏనాడూ కోతలన్న ముచ్చటే లేదు. రైతులు సంతోషంగా వ్యవసాయం చేసుకున్నరు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంట్ ఎప్పుడు అత్తదో.. ఎప్పుడు పోతదో అర్థంకాని పరిస్థితి దాపురించింది. గిట్లయితే రైతులు వ్యవసాయం చేసినట్టే. కరెంట్ సక్కగ లేకుంటే పంటలకు నీళ్లు ఎట్ల అందుతయ్. గతంల పంటలకు మంచిగ వచ్చినయి.. పథకాలు టైంకు అందినయి. గిప్పుడు కరెంట్ సమస్యతోటి మళ్లా మునుపటి పరిస్థితే కనబడతాంది. తెలంగాణ రాక ముందు నిరంతరం కరెంట్ కోతలతో రైతులకు కన్నీళ్లు తప్ప ఏం మిగిలేది కాదు. గట్లాంటి పరిస్థితుల్లో రైతులు సంతోషంగా బతకాలని అప్పటి సీఎం కేసీఆర్ కరెంట్ కష్టాలు లేకుండ చేసేందుకే పక్క రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసి అందించిండు. గసొంటి గొప్ప నాయకుడిని కాంగ్రెసోళ్లు తప్పు పట్టడం మంచిదికాదు. కేసీఆర్‌తోనే రైతులందరికి న్యాయం జరిగింది.

– ఎండీ సలీం ఖాన్, రైతు, మహదేవపూర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా


### మోటర్ల కాడ కాపలా ఉన్నం



వెంకటాపురం (నూగూరు) జూన్ 22 : తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు పంటలకు నీళ్లు పెట్టుకునేందుకు మోటర్ల కాడ అర్ధరాత్రులు కాపలా పడుకున్నం. ఎప్పుడు అత్తదో ఎప్పుడు పోతదో తెలియని పరిస్థితుల్లో కరెంట్ కోసం ఎదురుచూసుకుంట పురుగు, పుట్ర బారిన పడెటోళ్లం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్‌ను అందించిండు. అప్పటి సంది రాత్రి పూట బాయిలకాడికి పోయే తిప్పలు తప్పింది. మళ్లా కాంగ్రెస్ పాలనలో కరెంట్ సమస్య ఎన్కటి కాలాన్ని గుర్తుకు తెస్తాంది. ఇప్పుడే గిట్లుంటే ముందు ముందు ఇంకెన్ని కష్టాలు పడాల్నో అర్థమైతలేదు. రాష్ట్రంల ఒక్కరు కూడా ఇబ్బంది పడొద్దని ఎక్కడి నుంచే కరెంటు కొనుక్కొచ్చి ఇత్తే కాంగ్రెసోళ్లు ఉన్న దానిని సక్కగ చెయ్యక కేసీఆర్ మీద బురదజల్లుడు సరైంది కాదు.

– గడ్డం వివేక్, రైతు, వెంకటాపురం (నూగూరు)

### రోజుకు రూ. 200 నష్టపోతున్నం..



హనుమకొండ, జూన్ 22 : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు పడ్డ కరెంటు కష్టాలు మళ్లీ మొదలైనయ్. కేసీఆర్ పాలనలో ఏ ఒక్క రోజూ కరెంటు పోలేదు. ఇప్పుడు రోజుకు రెండు, మూడు సార్లు కరెంటు పోయి వస్తున్నది. టైంకు బట్టలు ఇస్త్రిరి చేసి ఇచ్చుడు జరగక కస్టమర్ల నుంచి మాకు ఇబ్బందులు వస్తున్నయి. కేసీఆర్ సార్ 24 గంటలు కరెంటు ఇచ్చినపుడు ఆదాయం బాగా ఉండేది. ఆయన ఎక్కడి నుంచి తెచ్చిండో తెల్వదు కాని కరెంటు పోకపోవడంతో మాకు మస్తు లాభమైంది. ప్రస్తుతం కరెంటు కోతలతో రూ. 200 వరకు ఆదాయం తగ్గడంతో కుటుంబం బతకడం కూడా ఇబ్బందిగా మారే ప్రమాదం ఉన్నది.

– నెల్లుట్ల సారంగం, ఇస్త్రీ షాప్, మచిలీబజార్, హనుమకొండ



### మళ్లీ కష్టాలు మొదలైనయ్..

గూడూరు, జూన్ 22 : ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న కరెంటు కష్టాలు మళ్లీ చూస్తున్నం. అప్పటి సమైక్యాంధ్ర నాయకుడు తెలంగాణకు కరంట్ ఇవ్వం, నీళ్లివ్వం అని కర్ర చూపిస్తూ చెప్పిన మాటలు మళ్లీ ఈ ప్రభుత్వంలో నిజమవుతున్నయి. నిజంగానే కరెంట్, నీళ్లు ఉంటలేవు. తెలంగాణ రాకముందు వ్యవసాయం చేయాలంటే అనేక కష్టాలు పడ్డం.. రాత్రి పూట ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పొలం కాడికి పోవాల్సి వచ్చేది. తెలంగాణ వచ్చినంక కరెంటు, నీళ్లు పుష్కలంగా లభించినయి. ఆడుతూ పాడుతూ వ్యవసాయం చేసుకునేటోళ్లం. కేసీఆర్ సీఎం అయిన తరువాతనే పాకాల వాగుపై మా ప్రాంతంలో చెక్‌డ్యాంలు కట్టి నీళ్లందించిండు. గతంలో కరెంట్ పోతే మేమే వైర్లు, పోల్స్ సరిచేసేది. కేసీఆర్ సారు ప్రభుత్వంలో రెప్పపాటు కూడా కరెం ట్ పోలేదు. వ్యవసాయ సీజన్ ప్రారంభం కాక ముందే మోటర్లు కాలిపోతున్నయి. ఇక మాకు భయం మొదలైంది.

– బానోత్ నర్సింహనాయక్ రైతు, గూడూరు

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- సహకార సంఘాల ద్వారా 7లక్షల మంది రైతులకు రుణమాఫీ
- టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

సుబేదారి, జూన్ 22 : రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు నెలలోపు రాష్ట్రంలో రూ. 2 లక్షల పంట రుణాలు మాఫీ చేస్తామని నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. ఒకే విడుతలో రుణాలు మాఫీ చేస్తున్న ఘటన దేశంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో 336 సహకార సంఘాల ద్వారా 7.75 లక్షల మంది రైతులు రుణాలు తీసుకున్నారని, వీరందరికీ ఆగస్టు లోపు రూ. 5,048 కోట్ల రుణాలు మాఫీ చేయడం జరుగుతుందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 87,432 రైతులకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. రైతుల సంక్షేమ కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. తనకు టెస్కాబ్ చైర్మన్ పదవి అప్పగించిన సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉమ్మడి జిల్లా మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో బ్యాంకు డైరెక్టర్లు కక్కిరాల హరిప్రసాద్, చెట్టుపల్లి మురళీధర్, నర్సింగారావు, జగన్మోహన్‌రావు, బ్యాంకు సీఈవో వాజీర్‌సుల్తాన్, బ్యాంకు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



హనుమకొండ నక్కలగుట్టలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు